## క్లుప్తంగా

### గ్రామాల అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్

**కె.గంగవరం:** ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్నా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పని చేస్తోందని ఆ పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. శివల గ్రామంలో మంగళవారం రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మంజూరు చేసిన రూ.15 లక్షల ఎంపీ నిధులతో అభివృద్ధి పనులకు ఆయన తనయుడు పార్టీ కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామంలో శ్మశాన వాటికతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, సర్పంచ్ అనుసూరి సాయి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సైదులుపేటలో అన్నదానం



సైదులుపేట అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట పట్టణం సైదులుపేటలోని గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా స్నేహ మిత్ర యూత్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 26 సంవత్సరాలుగా ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ అభినందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పట్టణ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

**నేడు అన్నసమారాధన**

**రామచంద్రపురం:** పట్టణంలోని లారీ యూనియన్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సర్వకార్య వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రతి ఏటా లారీ యూనియన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరుగుతుందని, భక్తులు హాజరుకావాలన్నారు.

### కంప్యూటర్ వ్యవహారాలపై సదస్సు

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట మండలం కో-ఆపరేటివ్ బ్యాంకు బ్రాంచ్ పరిధిలోని జెడ్ మేడపాడు పీఏసీఎస్‌లో మంగళవారం కంప్యూటర్ వ్యవహారాలపై సిబ్బంది, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కేంద్ర బ్యాంకు మండపేట బ్రాంచ్ మేనేజర్ బి.రవి, సూపర్‌వైజర్ వై.సత్యకాంత్ పర్యవేక్షణలోని అధికారులు పీఏసీఎస్ ద్వారా చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సలాది బాల సుబ్రహ్మణ్యం, సభ్యులు సంగిశెట్టి అమ్మన్న, బోయిడి మదన్‌మోహన రమణ, జెడ్ మేడపాడు సర్పంచ్ కంచెర్ల చంద్ర శేఖర్, సంఘ సభ్యులు, రైతులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### నాలుగోసారి మునిగిన కాజ్‌వే



కనకాయలంక కాజ్‌వే వద్ద వరద ఉధృతిలో వస్తున్న ప్రజలు

**పి.గన్నవరం:** మండలంలోని చాకలిపాలెం గ్రామానికి సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కనకాయలంక కాజ్‌వే ఈ ఏడాది నాలుగోసారి నీట మునిగింది. మంగళవారం రాత్రి కాజ్‌వేపై రెండు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు, కనకాయలంక గ్రామాల ప్రజలు వరదలో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆ గ్రామాల ప్రజలు రెండు నెలలుగా పడవలపై ప్రయాణిస్తున్నారు. అలాగే జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

# ఆటంకమే..

- వర్షంతో చిత్తడిగా మారిన పాఠశాల మైదానాలు
- ఆటలు ఆడేందుకు ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు
- దసరా సెలవుల తర్వాత నిర్వహించే అవకాశం

**రాయవరం:** బాలలకు విద్యతోపాటు క్రీడలు కూడా అవసరమే. పాఠశాల దశ నుంచే బాలబాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేశారు. అయితే ఈ పోటీలను తొలుత మండల స్థాయిలో నిర్వహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు సన్నాహాలు ప్రారంభించారు. ఇప్పటికే మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు సమావేశాలను కూడా నిర్వహించారు.

**మూడంచెల పద్ధతిలో..**

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకు, ప్రతిభావంతులను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఉపయోగపడతాయని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ పోటీలను తొలుతగా పాఠశాల స్థాయి, అనంతరం డివిజన్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తారు. స్కూల్ గేమ్స్‌కు సంబంధించి మొత్తం 50 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు మండల స్థాయి, అండర్-19 విభాగంలో ఇంటర్ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఏడు క్రీడాంశాలకు ముందుగా మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. రామచంద్రపురం, మండపేట, కె.గంగవరం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన విద్యార్థులకు రామచంద్రపురంలో డివిజన్ స్థాయి పోటీలు నిర్వహిస్తారు. డివిజన్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు, పతకాలు అందిస్తారు. వీటితో వివిధ ఉద్యోగాలకు క్రీడా కోట కింద రెండు, మూడు శాతం రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని క్రీడాకారులు చెబుతున్నారు.

**ఉత్సాహంపై నీళ్లు**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా నిర్వహించే క్రీడల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మండల స్థాయిలో క్రీడా పోటీలకు పాఠశాల మైదానాలను ఎంపిక చేసుకున్నారు. క్లస్టర్ పరిధిలో మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ఎస్‌జీఎఫ్ మండల స్థాయి కోఆర్డినేటర్లు ఏర్పాట్లు పూర్తి చేసుకుని, క్రీడల నిర్వహణకు సిద్ధంగా ఉన్నారు. ఈ తరుణంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి అవుట్ డోర్ గేమ్స్ నిర్వహించాలంటే క్రీడా మైదానాలు ఉండాలి. చెస్, బ్యాడ్మింటన్, యోగా వంటి పోటీలను ఇన్‌డోర్ గేమ్స్‌గా నిర్వహించుకునే అవకాశముంది. దీంతో మండల స్థాయిలో వర్షాల కారణంగా ఇన్‌డోర్ సదుపాయమున్న చోట గేమ్స్ నిర్వహిస్తున్నారు. వర్షాల కారణంగా ప్రస్తుతానికి అవుట్ డోర్ గేమ్స్‌ను వాయిదా వేశారు. వర్షాలు తగ్గకుంటే దసరా సెలవుల తర్వాత మండల స్థాయి, డివిజన్ స్థాయి అవుట్‌డోర్ గేమ్స్‌ను నిర్వహించాలని ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్లు నిర్ణయించుకున్నారు.

**దాతలే ఆధారం**

పోటీల నిర్వహణకు ప్రభుత్వ కొంతే సహకారం అందిస్తోంది. దీంతో దాతల సహకారం తీసుకోవాల్సిన వస్తోంది. పోటీల నిర్వహణకు అవసరమైన నిధులను ముందుగా సమకూర్చకుండా నేరుగా షెడ్యూల్‌ను ప్రకటించడం గమనార్హం. మండల స్థాయిలో క్రీడా పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు దాతల సహకారం కోరుతున్నారు. సర్టిఫికెట్లు, మెడల్స్, క్రీడాకారులకు అవసరమైన అల్పాహారం సమకూర్చేందుకు దాతలపైనే ఆధారపడుతున్నారు.



వర్షాలకు చిత్తడిగా మారిన పామర్రు క్రీడా మైదానం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

### ప్రస్తుతం వాయిదా వేశాం



వర్షాల కారణంగా ఆట స్థలాలు చిత్తడిగా మారాయి. ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించాలని తొలుతగా నిర్ణయించాం. వర్షాలు అధికంగా కురవడంతో దసరా సెలవుల అనంతరం క్రీడా పోటీలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– జి.సురేష్‌కుమార్, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్, కె.గంగవరం

### ఇండోర్ గేమ్స్ ఆడించాం



వర్షాల కారణంగా క్రీడా పోటీలకు ఇబ్బందిగా ఉంది. చెస్ పోటీలను నిర్వహించాం. వర్షాలు తగ్గిన వెంటనే, ఆటలకు అనుకూలంగా ఆట స్థలాలు మారిన తర్వాత మిగిలిన క్రీడాంశాలను నిర్వహిస్తాం. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు.

– కె.శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ రాయవరం మండల కోఆర్డినేటర్

### 11వ వార్డులో చైర్‌పర్సన్ దుర్గారాణి పర్యటన



11వ వార్డులో పరిస్థితులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట పట్టణం 11వ వార్డులో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పర్యటించారు. డ్రైన్లు తదతర వాటిని పరిశీలించారు. వార్డుకు చైర్‌పర్సన్‌కు స్థానికులు ఫిర్యాదులు అందజేశారు. వాటిపై మున్సిపల్ అధికారులతో చర్చించారు. కమ్యూనిటీ హాలు, డ్రైన్లు మరమ్మతులు చేపట్టడంతో పాటు అంబేడ్కర్ పార్కును సుందరీకరణ చేయాలని కోరారు. ఆమేరకు చర్యలు చేపట్టాలని చైర్‌పర్సన్ దుర్గారాణి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, కోఆప్షన్ సభ్యురాలు జంగా శాంత కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కనికెళ్ల పల్లవి ప్రసాద్, ఎస్.సింహాచలం, జి.శ్యామ్ సుందర్, సత్యనారాయణ, ఎస్.ధనరాజు, పి.సత్యనారాయణ, ఎం.భాస్కరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో రెండు గేదెల మృతి

**బిక్కవోలు:** కొమరిపాలెం లో కాలువరేవుల కరెంట్‌షాక్‌తో రెండు గేదెల మృతి చెందాయి. మంగళవారం సాయంత్ర నీరు తాగడానికి రేవులో వెళ్లాయి. అప్పటికే కరెంట్లు వైరు తెగిపడి ఉండడంతో అవి కాలువలో దిగడంతో కరెంట్ షాక్ కొట్టి మృతి చెందాయి. అదృష్ట వశాత్తు ఆ సమయంలో అక్కడ జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రెండు మూగజీవాలు కోల్పోయామని, సుమారు రూ.2.50 లక్షల వరకు నష్టపోయామని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు షీల్డులు, సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితర అధ్యాపకులు

**రామచంద్రపురం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా కళాశాల రసాయన శాస్త్ర విద్యార్థులతో పోస్టర్ ప్రెసెంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ ఓజోన్ పొరని సంరక్షించుకోవడానికి పర్యావరణ పరిరక్షణ కోసం క్లోరో ఫోర్ కార్బన్‌ల విడుదల తగ్గించేలా ప్రతి ఒక్కరూ తన వంతుగా కృషి చేయాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరు ఒక మొక్కలను పరిరక్షించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, రసాయన శాస్త్ర అధ్యాపకులు కే రాజేంద్ర ప్రసాద్, వి.గీత, బోటనీ అధ్యాపకులు డాక్టర్ పి.శారా, ఫిజిక్స్ అధ్యాపకులు కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా హిందీ భాషా దినోత్సవం**

స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ దేశ సంస్కృతిక ఐక్యతను ప్రతిబింబిస్తుందన్నారు. మన మాతృభాష తెలుగు ఒకటే కాకుండా హిందీ గురించి కూడా అవగాహన ఉండడం మనకు అవసరమన్నారు. హిందీ జాతీయ భాష కాబట్టి మనం హిందీ భాష కూడా నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కుమారి పద్మజా, హిందీ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీ రమణ మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14 తేదీన హిందీ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించారని హిందీ భాష, హిందీ సాహిత్యాన్ని గౌరవించేందుకు ఈ దినోత్సవం జరుపుకోవాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు షీల్డ్స్, సర్టిఫికెట్లను అందజేశారు.

### నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



మంగాయమ్మ(ఫైల్)

**రామచంద్రపురం రూరల్:** తాడిపల్లికి చెందిన మాధవరపు మంగాయమ్మ(65) సోమవారం రాత్రి హఠాన్మరణం పొందారు. ఆమె మృతితో విషాదంలో ఉన్నప్పటికీ ఆమె కుటుంబం మంచి నిర్ణయం తీసుకున్నారు. ఆమె నేత్ర దానానికి సమ్మతించి కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. దీనితో బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు టెక్నీషియన్లు గొర్రెల రవికుమార్, కె.నాని వచ్చి ఆమె కార్నియాలను సేకరించారు. ఆమె నుంచి సేకరించి కార్నియాలతో ఇద్దరు అంధులకు కంటి చూపు వస్తుందని వారు స్థానికులకు వివరించారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన భర్త ఆదినారాయణ, కుమారుడు శ్రీరామమూర్తి, కుమార్తె కొర్ల శేషారత్నంలను గ్రామ సర్పంచ్ పిల్లి అచల రాజశ్రీ, ఎంపీటీసీ రెడ్నం సతీష్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పిల్లి బాలసుబ్రహ్మణ్యం, స్థానిక పెద్దలు అభినందించారు.

## నరజాడ రహదారి అధ్వానం



శిథిలావస్థకు చేరిన టి.మామిడాడ రహదారి



గోతులమయంగా ఉన్న నరజాడ-అముజూరు రహదారి

**కె.గంగవరం:** మండలంలోని అముజూరు- నరజాడ రహదారి అధ్వానంగా మారింది. రహదారి పక్కనే పంట కాలువ ఉండడంతో రోడ్డు కోతకు గురైంది. మరోవైపు సుమారు 4 కిలోమీటర్లు ఉండే ఈ రహదారిలో ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది జనవరిలో హడావిడిగా ప్యాచ్ వర్కులు చేశారు. కానీ నాలుగు నెలలుకే రాళ్లుపైకి తేలి రహదారి గోతులమయంగా మారింది. కూళ్ల మల్లవరం, నరజాడ గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారినే నియోగిస్తుంటారు. ఈ రహదారి సరలేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారి మరీ దారుణంగా మారిందని ప్రయాణికులు చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**టి.మామిడాడ రహదారిని పునర్నిర్మించాలి**

**కాజులూరు:** టి.మామిడాడ రహదారి శిథిలావస్థకు చేరుకుని వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సుమారు 14 సంవత్సరాల క్రితం నాబార్డు నిధుల రూ.70 లక్షలతో జగన్నాథగిరి, ఆర్యావటంల మధ్య తర్లంపూడి, టి.మామిడాడల మీదుగా రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాల పాటించక పోవడంతో నిర్మించిన కొన్ని నెలలకే రోడ్డు శిథిలావస్థకు చెరుకుంది. రోడ్డు మొత్తం రాళ్లు లేగిసిపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ఈ రహదారిపై వాహనాలు నడపాలంటే తీవ్ర ఇబ్బందికరంగా మారిందని రాత్రి సమయాల్లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిస్కారానికి కృషి చేయ్యాలని మాజీ సర్పచ్ నురుకుర్తి శ్రీనివాసు, స్థానిక నాయకులు అణసూరి శివన్నారాయణ, అణసూరి శ్రీనివాసు, రాంబాబు, స్థానికులు కోరుతున్నారు.

## ‘స్వస్త్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్’ విజయవంతం చేయండి

**కాజులూరు:** గ్రామాలలో బుధవారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకూ జరుగు ‘స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.సౌజన్య, దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ కోరుతున్నారు.

ఈ మేరకు మంగళవారం వేరు, వేరు సంఘటనల్లో వారు మాట్లాడుతూ ఇంటిని చక్కబెట్టే మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ‘స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్’ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో రోజుకు ఒక గ్రామం చొప్పున వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ తదితర వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తామన్నారు. క్షయవ్యాధి, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు, కిశోర బాలికల ఆరోగ్యం పరిరక్షణ పైన అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం**

**కపిలేశ్వరపురం:** మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా ‘స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్’ పేరుతో ప్రత్యేక ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం పథకం నిర్వహణపై వైద్య, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు కార్యక్రమం విధివిధానాలను వివరించారు. ‘ఆరోగ్యవంతమైన మహిళలు – బలమైన కుటుంబాలు’ లక్ష్యంగా ఈ బుధవారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకూ మహిళల్లో బీపీ, షుగరు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై అవగాహన కల్పిస్తారన్నారు. పోషణ అభియాన్, తల్లి బిడ్డల సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య సేవలు, కిశోర్ బాలికల ఆరోగ్య పరీక్షలు, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్.మోహన్, ఎంపీహెచ్ఎస్ ఎం.నాని బాబు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరిమణి, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### తాగు నీరు వృథా



ద్రాక్షారామలో వృథాగా పోతున్న తాగునీరు

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో ఎస్వీ జూనియర్ కళాశాల వీధిలో సూర్యశ్రీ మాస్టారి ఇంటి వద్ద ఉన్న పబ్లిక్ మంచినీటి కుళాయికి ట్యాపు లేకపోవడంతో తాగు నీరు వృథాగా పోతోందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మంచినీటి పైపు లైన్‌కు కుళాయి బిగించి మంచి నీటి వృథాని అరికట్టాలని కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారం దిశగా చర్యలు

- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్
- 18 అంశాలపై చర్చ, తీర్మానాలు



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

**కపిలేశ్వరపురం (మండపేట):** పట్టణంలో ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ టీవీ రంగారావు 18 అంశాలతో కూడిన అజెండాను చదివి వినిపించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. అంశాల వారీగా చైర్‌పర్సన్ దుర్గారాణి సమావేశాన్ని నడిపించారు.

**ప్రయాణికుల అవస్థలు తొలగించాలి**

గుమ్మిలేరు రోడ్డులో అన్నపూర్ణ హైస్కూల్ సమీపంలో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు వీధి లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నారన్నారని చైర్ పర్సన్ నూక దుర్గారాణి ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ షెల్టర్ లేదని, ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందన్నారు. వీటన్నిటికీ పరిష్కారం కోసం ఏడిద రోడ్డులో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వినియోగంలోకి తేవడం మంచిదన్నారు. విజయవాడ వైపు వెళ్లే బస్సులను ఏడిద రోడ్డు మీదుగా మళ్లిస్తే ఏడిద రోడ్డులోని బస్టాండ్ ప్రయాణికులకు సౌకర్యావంతంగా ఉంటుందన్నారు. ఆ దిశగా ఆలోచన చేయాలని చైర్ పర్సన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లోనూ కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ప్రస్తావించారు. గతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టి దూరంగా తరలించేవారన్నారు. వాటి సంచార తీవ్రతను తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని రవి కుమార్ అన్నారు. ఏడిద బైపాస్ రోడ్డులో పెద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ కోరారు. విద్యుత్ స్తంభాలకు అమర్చిన కేబుల్ వైర్లు ప్రమాదభరితంగా మారాయన్నారు. 8వ వార్డులో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ కోరారు. విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీని కడితే మున్సిపల్ అధికారులు వెంటనే తొలగించేస్తున్నారని, కానీ ప్రైవేట్ కేబుల్ నెట్ వర్క్స్, ఫైబర్, ఇంటర్ నెట్ తదితర ప్రైవేట్ సంస్థల వైర్లు విద్యుత్ స్తంభాలను అల్లేస్తున్నా పట్టించుకోవడంలేదని కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ అన్నారు. దానికి సంబంధించిన ఫొటోలను చైర్ పర్సన్ దుర్గారాణికి చూపించారు.

**అధికారుల చొరవతో..**

ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ పట్టణంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. అధికారులు చొరవతో పని చేసి పరిష్కరించాలన్నారు. కమిషనర్ టీవీ రంగారావు మాట్లాడుతూ పట్టణంలోని పెద్ద కాలువ వంతెన వద్ద ఒకటి, బైపాస్ రోడ్డులోని లారీ యూనియన్ కార్యాలయం వద్ద రెండు, గుమ్మిలేరు రోడ్డు టోల్ గేట్ వద్ద ఒకటి మొత్తం నాలుగు మరుగుదొడ్లు నిర్మించనున్నామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కు అన్నపూర్ణ పాఠశాల వద్ద విజయవాడ వైపు బస్సులను నిలపకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

**పలు తీర్మానాలు ఆమోదం**

అజెండాలోని 18 అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి తీర్మానం చేశారు. 22వ వార్డు కృష్ణ కల్యాణి నగర్ రెండో వీధిలో రూ.3,51,707తో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, 28వ వార్డు ఆర్టీసీ బస్టాండ్ నుంచి దుర్గమ్మ గుడి వరకూ రూ.21.08,544తో సీసీ రహదారి నిర్మాణం, రూ.16,79,565లతో 21వ వార్డు మండపేట-ఆలమూరు రహదారిలోని శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు మరమ్మతు పనులు, ఏసీలు ఏర్పాటు చేయడం వంటి వేస్తారన్నారు. 6వ వార్డు కపిలేశ్వరపురం రోడ్డులో మున్సిపల్ కాంప్లెక్స్‌ను తొలగించిన ఖాళీ స్థలంలో రూ.6,53,138 పింక్ టాయిలెట్స్ నిర్మించనున్నారు. 23వ వార్డు సంఘం పుంత వద్ద డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త సర్దుబాటు చేసేందుకు రూ.2 లక్షలతో జేసీబీ యంత్రాన్ని సమకూర్చుకోవడం, ఐదు వేల లీటర్లు సామర్థ్యం గల వాటర్ ట్యాంకర్ కలిగిన ట్రాక్టర్, ట్రయిలర్‌లను రూ.4,50,000తో మరమ్మతు చేయించడం వంటి తీర్మానం చేశారు. 29వ వార్డు బైపాస్ రోడ్డు సమీపంలో రూ.3,50,000తో డ్రైన్ పిట్స్, పీవీసీ పైపుతో డ్రైన్ ఏర్పాటు చేయడం, రూ.2 లక్షలతోహెడ్ వాటర్ వర్క్స్ నందు జంగిల్ క్లియరన్స్, గ్రావెల్‌తో దార్లు ఏర్పాటు చేయుటం, మెప్మా స్వయంసహాక సంఘాల వారి పర్యవేక్షణలో 3వ వార్డులో బస్ స్టాండ్ వద్ద ‘తృప్తి క్యాంటీన్’ ఏర్పాటు చేయడం తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.

### వాడపల్లి క్షేత్రంలో గ్రామోత్సవం



వాడపల్లి క్షేత్రంలో వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

**కొత్తపేట:** కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి గ్రామోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా సాగింది. వైష్ణవ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, వివిధ సేవలను కనుల వైకుంఠంగా నిర్వహించారు. భక్తులు కనులారా తిలకించి తన్మయత్వం చెందారు. అనంతరం కోలాహలంగా ఉట్లోత్సవం నిర్వహించారు.

### ద్రాక్షారామ మార్కెట్ ఆక్రమణల పరిశీలన



ద్రాక్షారామ మార్కెట్‌ను పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ రామకృష్ణారెడ్డి

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలోని కూరగాయల మార్కెట్, మార్కెట్‌ను ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా ఆక్రమణల్లో ఉందని ప్రక్షాళన చేయాలని ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి సిబ్బందితో కలసి మంగళవారం ఆక్రమణలను పరిశీలించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు ఆయన విలేకరులకు తెలిపారు. ఈఈ వెంట పీఆర్ డీఈ కె.శ్రీనివాస్, ఏఈ ఏసురత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

### రైస్‌మిల్లుల్లో డీఎం విచారణ

**పి.గన్నవరం:** స్థానిక రైసుమిల్లు యజమానిని ఇటీవల ఒక వ్యక్తి బెదిరించి రూ.1.5 లక్షలు కాజేశాడని వచ్చిన ఆరోపణలపై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం విచారణ నిర్వహించారు. మిల్లు యజమాని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రైసుమిల్లులో బియ్యం నిల్వలను పరిశీలించారు.

**ధాన్యం కొనుగోలుకు చర్యలు**

జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి రైతుల నుంచి 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. జిల్లాలో 1,56,505 ఎకరాల్లో వరి పంట వేశారన్నారు. దీనికి సంబంధించి 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారన్నారు.